జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
ఆదివారం 01 నవంబర్ 2026 పేజీలు:16

2 లో

ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- పట్టభద్రుల ఓటు హక్కును నమోదు చేసుకున్న
- బీఆర్ఎస్ పార్టీ నాయకులు కురువ పల్లయ్య

బియ్యం ధరల దోపిడీకి చెక్ పెట్టండి.!

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు.. తహసీల్దార్లకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం
- బియ్యం రకం ఆధారంగా గరిష్ఠ ధరల నిర్ణయం.. ప్రతి దుకాణంలో ధరల పట్టిక తప్పనిసరి- రేషన్ బియ్యం పక్కదారి పడితే డీలర్లపై క్రిమినల్ కేసులు, లైసెన్సుల రద్దు.!

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో): మార్కెట్లో బియ్యం ధరల పెరుగుదలను నియంత్రించడంతో పాటు సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిఘా ఉంచాలని, మిగతా 2 లో

అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారం పై తహసీల్దార్ సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఉత్తర్వులు జారీ

నాగర్ కర్నూల్ అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో)

నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట డివిజన్, ఉప్పునుంతల మండలం, అయ్యవారిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 115లో భూ రికార్డుల నమోదుకు సంబంధించి జరిగినట్లు గుర్తించిన అవకతవకలు, సంబంధిత పత్రాల పరిశీలనలో విధుల నిర్వహణలో వైఫల్యంపై విచారణ మిగతా 2 లో

ఉక్కుమనిషి పటేల్ ఆశయాలే దేశ ఐక్యతకు బాటలు.!

- కులమత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటిగా ఉండాలి.. ఎస్పీ జానకి- మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో): దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి అన్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా మనమంతా భారతీయులమనే భావనతో ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిగతా 2 లో

బియ్యం ధరల దోపిడీకి చెక్ పెట్టండి.!

మొదటిపేజీ తరువాయి

నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బియ్యం ధరల నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత నెల వరకు కిలో బియ్యం ధర రూ. 55 నుంచి రూ. 60 వరకు ఉండగా, ప్రస్తుతం సూపర్ మార్కెట్లలో సైతం రూ. 85 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ధరల పెరుగుదలతో సామాన్య వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం బియ్యం రకాలను బట్టి గరిష్ఠ విక్రయ ధరలను నిర్ణయించిందని తెలిపారు.

ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ ధరలివే.!

ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బియ్యం విక్రయాలు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

– బీపీటీ / కేఎన్ఎం: కిలో రూ. 66– ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా: కిలో రూ. 74– హెచ్ఎంటీ / జేఎస్ఆర్: కిలో రూ. 79ఈ ధరలకు సంబంధించిన ఫ్లెక్సీలను రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు తమ పరిధిలోని వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి దుకాణంలో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ధరల పట్టికలను తప్పనిసరిగా ఏర్పాటు చేయించాలని ఆదేశించారు.

రేషన్ బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదు.!

మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే రేషన్ బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడకుండా అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఉద్దేశించిన విధంగా సన్నబియ్యం సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినా, లబ్ధిదారులకు తక్కువ పరిమాణంలో పంపిణీ చేసినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే రేషన్ దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

ధరల నియంత్రణపై నిరంతర నిఘా

బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను వ్యాపారులు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, సామాన్య వినియోగదారుల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, డీసీఎస్ఓ గంప శ్రీనివాస్, డీఎం రవి నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అనుప్రియ, క్రిస్టినా, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారం పై తహసీల్దార్ సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి

నివేదిక ఆధారంగా తహసీల్దార్ శ్రీమతి ఎ. సునీతను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ హేమంత కేశవ్ పాటిల్, సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయ్యవారిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 115లో 13.17 గుంటల భూమి అక్రమంగా ఇతరుల పేర్లపై నమోదైనట్లు పలు వార్తా దినపత్రికలో ప్రచురితమైన వార్త నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా ను విచారణ అధికారిగా నియమించగా, ఆమె సమగ్ర విచారణ నిర్వహించి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించారు. విచారణలో భాగంగా పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, ఖాస్రా, ఆర్ఓఆర్ రికార్డులు, భూ భారతి పోర్టల్‌లోని దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఎన్‌కంబరెన్స్ వివరాలు తదితర పత్రాలను పరిశీలించారు. విచారణ నివేదిక ప్రకారం, సర్వే నంబర్ 115లో మొత్తం 18.17 గుంటల భూమి ఉన్నట్లు ఖాస్రా రికార్డుల్లో నమోదై ఉంది. 1971–72 నుంచి 1976–77 వరకు ఉన్న పాత పహాణీలు, ఐబీ రిజిస్టర్ ప్రకారం మొత్తం భూమి ద్యాప రామిరెడ్డి పేరుపై నమోదై ఉన్నట్లు గుర్తించారు. నూతన ఆర్ఓఆర్ రికార్డుల ప్రకారం 13 ఎకరాల 17 గుంటలు సర్వే నంబర్ 115/ూలో ద్యాప రామిరెడ్డి పేరుపై, మిగిలిన 5 ఎకరాలు సర్వే నంబర్ 115/ూాలో పి. యాదమ్మ పేరుపై నమోదై ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. భూ భారతి పోర్టల్ ద్వారా దాఖలైన పేర్ల మార్పు, సర్వే నంబర్ ఉపవిభాగాల నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, వాటికి జతచేసిన పత్రాలు, డిజిటల్ సంతకాల ప్రక్రియను కూడా విచారణలో పరిశీలించారు. కొన్ని నమోదులు అసలు రెవెన్యూ రికార్డులతో సరిపోలడం లేదని, సంబంధిత పత్రాల ధృవీకరణలో లోపాలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, అప్పట్లో చారకొండ తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం డిప్యుటేషన్‌పై ఉప్పునుంతల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ. సునీత, తనకు అప్పగించిన చట్టబద్ధమైన విధులను సక్రమంగానిర్వర్తించడంలో విఫలమైనట్లు విచారణ నివేదికలో పేర్కొనడంతో ఆమెపై సస్పెన్షన్ చర్యలు చేపట్టారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 8(1)(ఖ) ప్రకారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుంది.

ఉక్కుమనిషి పటేల్ ఆశయాలే దేశ ఐక్యతకు బాటలు.!

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

అఖండ భారత నిర్మాణంలో పటేల్ పాత్ర చిరస్మరణీయం

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని వందలాది సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాదులు వేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి, ధైర్యసాహసాలు, నాయకత్వ పటిమ దేశ ఐక్యతకు బలమైన పునాదులుగా నిలిచాయని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని స్పష్టం చేశారు. సమాజంలో విభేదాలకు తావులేకుండా పరస్పర గౌరవం, సోదరభావం, ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు.

దేశ భద్రతలో పోలీసుల పాత్ర కీలకం

ముఖ్యంగా పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, అంతర్గత భద్రత పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఎస్పీ సూచించారు. ప్రజల్లో జాతీయ ఐక్యతా భావాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీలు రమణారెడ్డి, ఏఓ రుక్మిణి భాయ్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవి బాబు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ప్యారసాని సురేష్, కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ఆలంపూర్ అక్టోబర్ 31(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య శనివారం అయిజ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కుతో పాటు బాధ్యత అని, ఓటు ప్రజల సమస్యలను ప్రశ్నించే వజ్రాయుధమని పేర్కొన్నారు. ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు రావాల్సిన హక్కుల సాధన కోసం, ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించేందుకు ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని అన్నారు.

బీజేపీ ముమ్మరంగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

- సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఘన నివాళులు అర్పించిన బిజెపి నేతలు

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి):

మక్తల్ మున్సిపాలిటీలోని 14 వ వార్డు నేతాజీ నగర్ లో భారతీయ జనతా పార్టీ అర్బన్ మండల శాఖ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వార్డులలో ముఖ్య నాయకులు అంత కలిసి పట్టభద్రుల ఓటరు నమోదును పెద్ద ఎత్తున చేసే విధంగా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బిజెపి ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

భారతీయ జనతా పార్టీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య గారు హాజరై మాట్లాడుతూ దేశ స్వాతంత్రం అనంతరం భారతదేశ తొలి ప్రధానిగా హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహించి 560కి పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతకు విశేషాలు కృషి చేశారని పేర్కొన్నారు. హైదరాబాదు సంస్థానం దేశంలో విలీనం కావడం సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి సాహసోపేత నిర్ణయం కృషి వలె సాధ్యమైందని, ఆయన పరిపాలన దక్షత దృఢమైన నాయకత్వం దేశ సమగ్రత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొండయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కర్ని స్వామి,జిల్లా నాయకులు కావలి వెంకటేష్ దేవరింటి నరసింహారెడ్డి,సుకన్య శేఖర్ పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ప్రధాన కార్యదర్శులు నరేందర్,అశోక్,కౌన్సిలర్లు పికె నరసింహ,టప్ప కృష్ణ బిజెపి నాయకులు సూర్య ఆంజనేయులు,విద్యాసాగర్, , రంకుల ఆంజనేయులు,రఘువీర్,జిల్లా బీజేవైఎం నాయకులు మహేష్ సాగర్, బ్యాటరీ రాజు,లక్ష్మణ్ విజయ్ కృష్ణ, ఆంజనేయులు,అనిత,రాధిక,రవి, భరత్,, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రిష్ణా రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు సేవలు ప్రారంభం

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు మక్తల్ ప్రజల తరపున కృతజ్ఞతలు

- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి):

నారాయణపేట జిల్లాలో గల మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల ప్రయాణికులకుఅత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కృష్ణా రైల్వే స్టేషన్మీదుగా సరికొత్త బెంగళూరు - ముంబై వందే భారత్ స్లీపర్ రైలు సేవలు నేటి నుంచి ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టింది. వందే భారత్ రైలు ప్రతిరోజు రాత్రి 7:40 నిమిషాలకు క్రిష్ణా రైల్వే స్టేషన్ కు చేరుకుని 7: 50 నిమిషాలకు బయలుదేరనుంది. మక్తల్ నియోజకవర్గంలో క్రిష్ణా రైల్వే స్టేషన్ నవంబర్ 1 నుంచి మరో ప్రత్యేకతను సంతరించుకొని వందే భారత్ రైలు సేవలను ప్రారంభించుకోవడం అనేది ఈ ప్రాంత ప్రజలు సంతోషించదగ్గ విషయమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి అన్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలి వందే భారత్ స్లీపర్ ట్రైన్ బెంగళూరు నుంచి క్రిష్ణా మీదుగా ముంబైకి సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన మెరుగైన రైలు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానున్నట్లు ఆయన తెలిపారు. వందే భారత్ రైలు సేవలు క్రిష్ణా రైల్వే స్టేషన్ లో ప్రారంభం అయ్యేందుకు విశేష కృషి చేసిన స్థానిక ఎంపీ డీకే అరుణమ్మతో పాటు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు ఈ సందర్భంగా మక్తల్ ప్రాంత ప్రజల తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మక్తల్ ప్రాంత ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని వారి ప్రయాణాలను సుఖాంతం చేసుకోవాలని ఆయన కోరారు.

పుల్లూరులో యూపీఎస్ పాఠశాల సందర్శన.. అంగన్వాడీలో డిజికిడ్స్ డిజిటల్ విద్యను ప్రారంభించిన

- ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు

ఆలంపూర్ అక్టోబర్ 31(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలం

పుల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే విజయుడు పర్యటించారు. ఈ సందర్భంగా యూపీఎస్ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల కోసం డిజికిడ్స్ డిజిటల్ విద్యా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొజెక్టర్లు, ధ్వనివర్ధక పరికరాలు, డిజిటల్ విద్యా సామగ్రి ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన ఆధునిక విద్యను అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ట్రీ ట్రీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అమలు చేస్తోంది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

కృష్ణా అక్టోబర్ 31 (ప్రజాజ్యోతి)

ముడుమాల: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాలలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ గారు భారత ఉక్కు మనిషి, భారత రత్న, భారత దేశ తొలి ఉప ప్రధాని, భారత జాతి ఐక్యతకు మూల కారకులు శ్రీ సర్దార్ వల్లాభాయ్ పటేల్ గారి జయంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటానికి పూలమాల వేసి, వారు భారత దేశానికి చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులంతా చిన్నతనం నుండే దేశ సమైక్యతా భావాలను ఏర్పరచుకొని దేశ సేవకు పాటు పడాలని పిలిపిచ్చారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, రవికుమార్, పద్మావతమ్మ, మహేశ్వరి, రేణుక, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని నివాళులు అర్పించారు..

శేషంపల్లి బైక్ ప్రమాదంలో మూడో యువకుడు కిరణ్ మృతి

- మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించిన - అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు

ఆలంపూర్ అక్టోబర్ 31(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల్ నియోజకవర్గం మల్దకల్ మండలం శేషంపల్లి సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. లిప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్న తాండ్రపాడుకు చెందిన పెయింటర్ కిరణ్ (24) శుక్రవారం రాత్రి మృతి చెందాడు.కిరణ్ మృతి విషయం తెలుసుకున్న అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు వెంటనే స్పందించి, మృతుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తనవంతుగా రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బైక్ ప్రమాదంలో మృతి చెందిన కిరణ్ కుటుంబాన్ని పరామర్శించిన

- ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు

ఆలంపూర్ అక్టోబర్ 31(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల్ నియోజకవర్గం మల్దకల్ మండలం శేషంపల్లి సమీపంలో నిన్న జరిగిన బైక్ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం లో చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన పెయింటర్ కిరణ్ (24) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కిరణ్ మృతి విషయం తెలుసుకున్న అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పించి, పోస్టుమార్టం ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కిరణ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలి....

- ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన

ముఖ్య అతిథి ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి,స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్

- డా.ఆంజనేయ గౌడ్ - నియోజకవర్గ బిఆర్.ఎస్ పార్టీ ఇంచార్జిబాసు హనుమంతు నాయుడు

ఆలంపూర్ అక్టోబర్ 31(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలోని మహబూబ్ నగర్ - హైదరాబాద్ - రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియపై నిర్వహించిన కేటీ దొడ్డి,ధరూర్ మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశానికి హాజరై, పట్టబద్రుల ఓటర్ నమోదు ప్రాముఖ్యతను వివరిస్తూ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కల్లో అందరూ కష్టపడి పనిచేస్తే బీఆర్.ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని వారు స్పష్టం చేశారు.అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. అలాగే పార్టీ శ్రేణులు మహబూబ్ నగర్ - హైదరాబాద్ - రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో జరగబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా బీఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కొరకు నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా కృషి చేయాలని, ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు అభ్యర్థించాలని కోరారు. అలాగే.పట్టబద్రులు ఉచితంగా నమోదు చేసుకునేందుకు నియోజకవర్గంలోని వివిధ మండల కేంద్రాలలో ఉచిత ఓటర్ నమోదు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి, బిఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.రాఘవేంద్ర రెడ్డి,ప్రతాప్,శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,చక్రీధర్ రెడ్డి,రాజారెడ్డి,బీచుపల్లి,మోనేష్ మరోజు,సి.కె.రంగన్న,జాంపల్లి భరత్ సింహారెడ్డి,శేఖర్ నాయుడు, గాజుల కృష్ణారెడ్డి,శ్రీరాములు,లక్ష్మారెడ్డి,డ్యాం శీను,ముని మౌర్య, మునిరెడ్డి, వీరేష్ గౌడ్,మరియు వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పట్టబద్రులు మరియు తదితరులు పాల్గొన్నారు......

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పట్టపగలే వెలుగుతున్న స్ట్రీట్ లైట్లు

- విద్యుత్ వృధా, పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

ఆలంపూర్ అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హీరో హోండా షోరూం నుండి జమ్మిచెడు వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఉన్న హై మాస్ట్ లైట్లు మరియు సెంట్రల్ లైటింగ్ సిస్టం పగటిపూట కూడా ఆన్ లోనే ఉండటం గమనార్హం. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ఇలా పగటిపూట లైట్లు వెలుగుతూ ఉండటం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఒకవైపు విద్యుత్ ఆదా చేయాలని ప్రభుత్వం పిలుపునిస్తుంటే, మరోవైపు మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే స్ట్రీట్ లైట్లు ఆఫ్ చేయాల్సి ఉండగా, 11 గంటలు అవుతున్న కూడా వెలుగుతూనే ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని విమర్శలు వస్తున్నాయి.ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి పట్టపగలే స్ట్రీట్ లైట్లను ఆఫ్ చేయాలని పట్టణ ప్రజలు సోషల్ మీడియాకు తెలిపారు.

ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన : ఎంపీడీవో

- మస్టర్‌లో అక్రమాలకు తావులేకుండా .. కొలతల ప్రకారం పనులు చేయాలి

చిన్నంబావి,అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండలంలోని పెద్ద మారూర్ గ్రామ శివారులో వి.బి.జి. రామ్ జీ పథకం క్రింద చేపడుతున్న ఉపాధి హామీ పనులను చిన్నంబావి మండల ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫీడర్ ఛానల్, కాల్వల పూడికతీత పనులను పరిశీలించడంతో పాటు కూలీల హాజరు మస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలు తమకు కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఒకరి పేరుతో మరొకరు పనికి రావద్దని, పనికి హాజరుకాని వారి పేర్లను మస్టర్‌లో నమోదు చేయరాదని స్పష్టం చేశారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. కూలీలకు వేతనాలు సకాలంలో అందించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కూలీలకు సూచించారు.ఈ తనిఖీలో ఏ పీ ఓ, మెట్లు,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు, సంక్షేమ పథకాలు అందాలి!

- అయ్యవారిపల్లిలో “నాల్స” మెగా డ్రైవ్ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహణ

- ఉచిత న్యాయ సేవలపై గ్రామస్థులకు అవగాహన

-- దివ్యాంగురాలికి వీల్‌చైర్, అర్హులకు లేబర్ కార్డుల పంపిణీ

మహబూబ్‌నగర్ అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్స) చేపట్టిన మెగా డ్రైవ్ కార్యక్రమాన్ని కోయిలకొండ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో ఘనంగా ముగించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిరా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మెగా డ్రైవ్ ద్వారా సాధించిన ప్రగతిని వివరించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన పేద ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, వివిధ సంక్షేమ పథకాలు, హక్కుల గురించి వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో ఒక దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేశారు. మెగా డ్రైవ్ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, పారా లీగల్ వాలంటీర్ల సేవలను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, కోయిలకొండ ఎంపీడీఓ ధనుంజయ్ గౌడ్, తహసీల్దార్ దీపక్ రావు, ఎస్ఐ నాగరాజు, అసిస్టెంట్ రీజినల్ లేబర్ ఆఫీసర్ మహేందర్, గ్రామ సర్పంచ్ వాగ్య నాయక్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గోపాల్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, బ్రహ్మ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు జి. చంద్రశేఖర్, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత !

- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన.. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో న్యాయ చైతన్య కార్యక్రమాలు

- 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా ఐదు పాఠశాలల్లో అవగాహన సదస్సులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

బాలల హక్కులను పరిరక్షించడం, వారిపై జరిగే లైంగిక వేధింపులు, నేరాలను అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యాయాధికారులు పేర్కొన్నారు. బాలలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనపై భయపడకుండా గొంతు విప్పేలా వారిలో చైతన్యం కల్పించాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ , మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్ -- పోక్సో చట్టం, 2012పై పాన్ ఇండియా పాఠశాల అవగాహన కార్యక్రమం' మొదటి దశలో భాగంగా అక్టోబర్ 31న జిల్లాలోని ఐదు పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులకు పోక్సో చట్టం-2012లోని ముఖ్యమైన నిబంధనలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, బాలలపై లైంగిక వేధింపుల నివారణ, బాలల రక్షణ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను గుర్తించి, ఎలాంటి భయం లేకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని

విద్యార్థులకు సూచించారు.

ఐదు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు

1. గవర్నమెంట్ గర్ల్స్ కాలేజీ, మహబూబ్‌నగర్: పోక్సో కోర్టు న్యాయమూర్తి టి. రాజరాజేశ్వరి, డీఎల్ ఎస్ ఏ కార్యదర్శి డి. ఇందిరా, డిప్యూటీ చీఫ్ యోగేశ్వర్ రాజ్, అసిస్టెంట్లు మల్లారెడ్డి, శివరాజ్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.
2. గవర్నమెంట్ పోలీస్ లైన్ స్కూల్, మహబూబ్‌నగర్: స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మొహమ్మద్ మునవార్, న్యాయవాదులు కార్తీక్, అశోక్ గౌడ్, రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.
3. జెడ్పీహెచ్ఎస్, రాంనగర్, కోయిలకొండ: ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రవిశంకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.
4. గీతం హైస్కూల్, జడ్చర్ల: అదనపు జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ముదసిర్, ఎస్ఐ అక్షిత్, సీనియర్ న్యాయవాది మాలిక్ పాల్గొన్నారు.
5. తక్షశిలా హైస్కూల్, మహబూబ్‌నగర్: ××× అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అనిత, న్యాయవాది టి. కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల రక్షణకు సమష్టి బాధ్యత

బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, సంబంధిత అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఈ కార్యక్రమాల్లో వివరించారు. పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించే వాతావరణాన్ని కుటుంబాలు, పాఠశాలలు కల్పించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, వారికి భద్రమైన భవిష్యత్తు కల్పించడం, నేరాల నివారణపై విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పేర్కొంది.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

- శ్రీ ప్రహర్ష దేవి చాటుకున్న ట్రస్ట్ చైర్మన్,కురువ చిన్న మల్లయ్య

చిన్నంబావి, అక్టోబర్ 31(ప్రజాజ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని వెల్లటూర్ గ్రామానికి చెందిన పరిమళ నరసింహా (48) అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషాదకర విషయం తెలుసుకున్న శ్రీ ప్రహర్ష దేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కురువ చిన్న మల్లయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మృతుని భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ పెద్దను కోల్పోయి దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా నిలిచేందుకు తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన సామాజిక బాధ్యతగా భావిస్తూ కురువ చిన్న మల్లయ్య అందించిన ఆర్థిక సహాయంపై గ్రామస్థులు, పలువురు అభినందనలు తెలిపారు. ఆయన చూపిన మానవత్వం, సేవాభావం, సామాజిక బాధ్యత ఆదర్శనీయమని హర్షం వ్యక్తం చేశారు.

దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

దేశ సమైక్యత, సమగ్రత, అంతర్గత భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేశ తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలోని సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి జాతీయ సమైక్యతకు విశేష కృషి చేసిన పటేల్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కొనియాడారు. ఆయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకోవడానికి గొప్ప సందర్భమని పేర్కొన్నారు.అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, దేశ అంతర్గత భద్రతను పటిష్టం చేయడంలో తమ వంతు సహకారం అందిస్తామని అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్ఓ ఏ. నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భవిష్యత్ నైపుణ్యాల బాట.!

- 'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్' ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- 26 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు..

కమ్యూనికేషన్ నుంచి కెరీర్ ప్రణాళిక వరకు నాలుగు కీలక అంశాలపై శిక్షణ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను 21వ శతాబ్దపు సవాళ్లకు దీటుగా తీర్చిదిద్ది, భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా 'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారులకు కార్యక్రమ అమలుపై అవగాహన కల్పించారు.

మార్కులే కాదు.. జీవిత నైపుణ్యాలూ ముఖ్యం.!

ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, సామాజిక, ఉద్యోగ రంగాల్లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం విద్యాపరమైన మార్కులే విద్యార్థుల భవిష్యత్తుకు సరిపోవని, కమ్యూనికేషన్, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి జీవిత నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న ఉద్యోగ రంగ అవసరాలను గుర్తించి విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో స్థిరమైన ఉపాధి

అవకాశాలను పొందేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని తెలిపారు.

26 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు

జిల్లాలోని మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందులో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు ప్రధాన అంశాల ద్వారా విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలను అందించనున్నారు.

1. యంగ్ ఒరేటర్స్ క్లబ్ : విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు, మౌఖిక సంభాషణ, వేదికపై ధైర్యంగా ప్రసంగించడం, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందిస్తారు. ఈ కార్యక్రమానికి కీర్తన వేపా ప్రతినిధిగా వ్యవహరిస్తారు.
2. థింక్ అండ్ మేక్ : విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే సామర్థ్యాలను అభివృద్ధి చేస్తారు. ఈ కార్యక్రమానికి నాగేష్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.
3. స్వతః : విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు అలవాట్లు, డబ్బు నిర్వహణ, ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమానికి సంతోష్ దిన్నె, యువరాజ్ సక్కూర్ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు.
4. ఫ్యూచర్ డాట్స్ : 9, 10వ తరగతి విద్యార్థులకు వివిధ వృత్తులు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య, భవిష్యత్ కెరీర్ ప్రణాళికపై మార్గదర్శకత్వం అందిస్తారు. ఈ కార్యక్రమానికి పవన్ కుమార్ కొల్లి, నిఖిల్ దాసరి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభకు కొత్త వేదిక

జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందించడం ప్రస్తుత కాలపు అవసరమని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చక్కని వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, డీఎస్ఓ షంషీర్, జీసీడీఓ అస్రా ఖాద్రి, ఎంఈఓ ఉషారాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సమీక్ష

- ఎస్.ఎన్.సి.యు లో మరణాల కారణాల పరిశీలన..

వైద్య సదుపాయాలు, ఆహార నాణ్యతపై డీఎంహెచ్ఓ ఆరా

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిశు మరణాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వైద్య సేవల నాణ్యతను మెరుగుపరిచే అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అక్టోబర్ నెలకు సంబంధించిన శిశు మరణాలపై సౌకర్య ఆధారిత సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్.ఎన్.సి.యు) లో నమోదైన శిశు మరణాలపై ప్రధానంగా చర్చించారు. నెలలు నిండకముందే జన్మించడం, పుట్టుక సమయంలో ఆక్సిజన్ అందకపోవడం, శ్వాసకోశ సమస్యలు తదితర కారణాలతో సంభవించిన మరణాల వివరాలను పరిశీలించారు. శిశు మరణాలకు దారితీస్తున్న

పరిస్థితులను విశ్లేషించి, వైద్య సేవల్లో మెరుగుదలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు ఎస్.ఎన్.సి.యును సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది, ఇతర మానవ వనరులు, వైద్య పరికరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిశువులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా సదుపాయాలను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు సరఫరా చేస్తున్న ఆహార నాణ్యతను కూడా తనిఖీ చేశారు. రోగులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండేలా చూడాల్సిన అవసరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులుతో పాటు డీఐఓ డాక్టర్ శైలజ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి మల్లికార్జున్, పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ అజయ్ మోహన్, ఎస్ఎన్‌సీయూ పీడియాట్రిషియన్ డాక్టర్ విజయ్ కుమార్, గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్, డాక్టర్ పులి విద్య పాల్గొన్నారు.

కరెంటు కోతలతో కర్షకుడి కంట కన్నీరు..!

- పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదా.?- మాచన్‌పల్లిలో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు- ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలి.. రైతులకు పూర్తిస్థాయిలో విద్యుత్, సాగునీరు అందించాలి

మహబూబ్‌నగర్ అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఒకవైపు అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతన్నకు ప్రకృతి పరీక్ష పెడుతుంటే.. మరోవైపు విద్యుత్ కోతలు, సాగునీటి కొరత రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కళ్లముందే పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను మాజీ మంత్రి విరసనోళ్ల శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సాగు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై ప్రభుత్వ తీరును ప్రశ్నించారు.

అప్పుల పాలైన రైతుకు దిక్కెవరు.?

రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పంట చేతికొచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలో తినడానికి గింజలు లేని దుస్థితిలో రైతులు ఉన్నారని, అప్పులు తీర్చలేక వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. రైతులు ప్రాణాలు కోల్పోతే బీమా సొమ్ము కూడా అందడం లేదని ఆరోపించారు.

రూ.381 కోట్లతో విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పించాం.. అయినా కరెంటు ఎందుకు లేదు.?

గతంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, స్తంభాల ఏర్పాటుకు రూ.381 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఇంతటి మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ రైతులకు నిరంతర విద్యుత్ అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదని విమర్శించారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యమెందుకు.?

నీటి విషయంలో పాలమూరు రైతాంగానికి అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. నీటిని చంద్రబాబు వైపు తరలిస్తున్నారంటూ విమర్శించారు. మహబూబ్‌నగర్ రిజర్వాయర్లను నింపడం లేదని, చెరువులకు నీటిని మళ్లించడం లేదని అన్నారు. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయకుండా టెండర్లు రద్దు చేశారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పంటలు వేయవద్దని సూచించిన ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, రైతుబంధుతో పాటు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఇంకా కొంతమేర పంటలు మిగిలి ఉన్నాయని, అవి కూడా ఎండిపోకుండా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు.

వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.?

ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క వ్యవసాయ కూలీకి రూ.36 వేల వరకు బకాయి ఉందని ఆరోపిస్తూ, ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని కోరారు.

పశుగ్రాసం, నిత్యావసరాలపై కూడా దృష్టి పెట్టాలి

పంటలు ఎండిపోవడంతో పశువులకు మేత కొరత ఏర్పడుతోందని, రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం అందించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, సాగునీటి సదుపాయాలు కల్పించాలని, పెరిగిన నిత్యావసర ధరల భారాన్ని తగ్గించేందుకు పేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు.భూముల విక్రయాలు, ఎన్నికల హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు హామీల అమలుపై నిలదీయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణకు సంబంధించిన నీటి హక్కులు, సాగునీటి ప్రయోజనాల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో నీటి సలహాదారుగా పనిచేసిన అధికారిని తెలంగాణలో నియమించడంపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించకపోతే రైతాంగ ఆగ్రహం తప్పదు.!

రైతుల కష్టాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి విద్యుత్, సాగునీరు, పంట నష్టపరిహారం, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం వంటి అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే వారి నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు మల్లు నర్సింహారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాఘవేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలానికి కురువ చిన్న మల్లయ్య బిగ్ షాక్!

- బీజేపీకి త్వరలో రాజీనామా..

మరో పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధం

చిన్నంబావి, అక్టోబర్ 31 (ప్రజాజ్యోతి)

చిన్నంబావి కొల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీకి కురువ చిన్న మల్లయ్య షాక్ ఇవ్వనున్నారు. చిన్నంబావి మండలం వెల్లటూర్ గ్రామానికి చెందిన ఆయన త్వరలోనే బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి మరో పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. 2018 నుంచి బీజేపీలో కొనసాగుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని, పేద ప్రజల సమస్యలపై పోరాడుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు సొంతంగా ఖర్చు చేసినా నాయకత్వం నుంచి తగిన గుర్తింపు, సహకారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కొల్లాపూర్ తాలూకా, రాష్ట్ర నాయకత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు లేకపోవడంతోనే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే రాజీనామా చేసి, ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానని తెలిపారు. ఆయన ప్రకటనతో చిన్నంబావి మండల రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా నాయిని భాగన్న గౌడ్..

ప్రధాన కార్యదర్శిగా కౌండిన్య రాజశేఖర్ గౌడ్

- నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

మహబూబ్‌నగర్ అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):
గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాయిని భాగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కౌండిన్య రాజశేఖర్ గౌడ్, ఆర్థిక కార్యదర్శిగా అబ్బా శశిధర్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అధ్యక్షుడు ఘనంగా సన్మానించారు.

నూతన కార్యవర్గ వివరాలు:

- జిల్లా అధ్యక్షుడు: నాయిని భాగన్న గౌడ్
- ప్రధాన కార్యదర్శి: కౌండిన్య రాజశేఖర్ గౌడ్
- ఆర్థిక కార్యదర్శి: అబ్బా శశిధర్ గౌడ్

ఉపాధ్యక్షులు:

సుక్కల సత్యనారాయణ గౌడ్, డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, చెరుకు వెంకటేష్ గౌడ్, భుజగౌని జగన్మోహన్ గౌడ్, సత్తూరు బాలరాజు గౌడ్, అమ్మిక సురేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆర్కే న్యూస్ జి. జగన్ మోహన్ గౌడ్, ఎడ్ల బాలవర్ధన్ గౌడ్.

ఆర్గనైజింగ్ సెక్రటరీలు:

నాయనోళ్ల హర్షవర్ధన్ గౌడ్, గుమ్మడాల రఘురాం గౌడ్, చుక్కల తిరుపతయ్య గౌడ్, ఎడ్ల వెంకటేష్ గౌడ్, అల్లిపూర్ శీను గౌడ్.

జాయింట్ సెక్రటరీలు:

జీనుగుంట సురేందర్ గౌడ్, తోకల నందకిషోర్ గౌడ్, తోకల రాజశేఖర్ గౌడ్, గురు ప్రసాద్ గౌడ్.

ఇతర బాధ్యతలు:

- సాంస్కృతిక కార్యదర్శి: బాదేపల్లి వెంకటయ్య గౌడ్
- లీగల్ అడ్వైజర్: గార్డ్ శ్రీశైలం గౌడ్
- గేట్ మెంబర్: సురేంద్ర గౌడ్
- గౌరవ సలహాదారు: వాడడం సత్యనారాయణ గౌడ్

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు. సంఘం అభివృద్ధికి, గౌడ అఫీషియల్స్ మరియు ప్రొఫెషనల్స్ ఐక్యతకు, సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఆశయాల బాటలో ప్రజాపాలన

పెబ్బేరులో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు

పెబ్బేరు అక్టోబర్31 ప్రజాజ్యోతి

భారత ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో పెబ్బేరు పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..భారతదేశ ప్రజల ఆశాజ్యోతి ఇందిరా గాంధీ అని కొనియాడారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. 'గరీబీ హటావో' నినాదంతో ప్రతి పేదవాడికి 'రోటీ, కపడా, మకాన్' (కూడు, గుడ్డ, గూడు) అందించిన మహానేత ఇందిరమ్మ అని అన్నారు. దేశాన్ని అనేక రంగాలలో అభివృద్ధి బాటలో నడిపించి, ప్రపంచ అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పాలన ఆనాడు ఇందిరా గాంధీ అందించిన స్ఫూర్తితోనే నేడు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమపాలనందిస్తోందని తెలిపారు. రేవంత్ నాయకత్వంలో చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా ప్రతి పేదవాడి కళ్లల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. ఈ

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంతం దయాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, యుగంధర్ రెడ్డి,జిల్లా యువజన నాయకుడు రంజిత్ కుమార్, వెంకటరమణ, బూరమోని రాములు యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారపోగు వెంకటేష్, కౌన్సిలర్లు శివసాయి, తాటికొండ కృష్ణ, శివ,మాజీ సర్పంచులు సురేందర్ గౌడ్, సత్యనారాయణ,రణధీర్ రెడ్డి, లక్ష్మణ్ నాయుడు, వనం మల్లేష్, రాముడు, రాజా గౌడ్, తాటికొండ ఆంజనేయులు, తిరుపతయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్, గంధం ఉత్తమ్ కుమార్, బాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా..

– సీఎం సహాయనిధి!

- నిరుపేద మహిళ వైద్య చికిత్సకు రూ.3.50 లక్షల ఎల్ఓసీ మంజూరు

- బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డి

చిన్నంబావి, అక్టోబర్ 31 (ప్రజాజ్యోతి):
అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోంది. ఆపద సమయంలో ఆదుకునే ఆర్థిక భరోసాగా నిలుస్తూ ఎంతోమంది నిరుపేదల కుటుంబాల్లో సీఎం సహాయనిధి కొత్త వెలుగులు నింపుతోంది. అర్హులైన పేదలకు ప్రభుత్వ సహాయం అందేలా పలువురు ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన నాయకులు చేస్తున్న కృషి బాధిత కుటుంబాలకు ఊరటనిస్తోంది. ఈ క్రమంలోనే బెక్కెం వేణుగోపాల్ రెడ్డి తన వంతు చొరవతో మరో నిరుపేద మహిళ వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు.

మహిళ వైద్య చికిత్సకు రూ.3.50 లక్షల సాయం

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెలుటూరు గ్రామానికి చెందిన పల్లె నాగలక్ష్మమ్మ, భర్త దివంగత పల్లె నరసింహ. ఆమె కొంతకాలంగా గుండె రక్తనాళాల సంకోచ వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం మెరుగైన చికిత్స అవసరమని, ఇందుకు గణనీయమైన మొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. ఇప్పటికే కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబానికి వైద్య ఖర్చులు మరో భారంగా మారాయి. ఆర్థిక స్థోమత లేక ఖరీదైన వైద్యం చేయించుకోవడం కష్టంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ పరిస్థితిని కుటుంబ సభ్యులు బెక్కెం వేణుగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి, బాధితురాలి పరిస్థితిని మానవీయ కోణంలో పరిశీలించారు. పేద కుటుంబానికి మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో సంప్రదించి కృషి చేశారు. ఆయన చొరవతో బాధిత మహిళ వైద్య చికిత్స నిమిత్తం రూ. 3,50,000 మూడు లక్షల యాభై వేల రూపాయలు విలువైన ఎల్ఓసీ లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరైంది. దీంతో ఖరీదైన వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబానికి పెద్ద ఊరట లభించింది.

నిరుపేదల పాలిట ఆపన్నహస్తంగా వేణుగోపాల్ రెడ్డి సేవలు

కేవలం ఒక్క కుటుంబానికే కాకుండా, వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా బెక్కెం వేణుగోపాల్ రెడ్డి నిరంతరం చొరవ చూపుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అండగా నిలవడం, ప్రభుత్వ పథకాల ద్వారా వారికి అందాల్సిన సహాయాన్ని అందేలా కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఎంతోమందికి ఊరటనిస్తున్నాయని అన్నారు. నిరుపేద కుటుంబాల్లో వైద్య ఖర్చుల కారణంగా ఏర్పడే ఆర్థిక సంక్షోభాన్ని కొంతమేర తగ్గించడంలో ఇలాంటి సహకారం కీలకంగా మారుతోందని అభిప్రాయపడ్డారు.



VEMULA SRINIVASULU,
LLM., MBA.,
O.S.D. TO CHIEF MINISTER
GOVERNMENT OF TELANGANA

Room No.3, 6th Floor,
Dr.B.R.Ambedkar Telangana
Secretariat Hyderabad.
Ph.No. 040-23450466
Fax No. 040-23459944

CHIEF MINISTER'S OFFICE

Lr. No.15194/CMRF-LOC/2026, Dated:31-10-2026

To
The Director,
M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir,

Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SRI CMCO , , dt.31-10-2026

@@@

The Hon'ble Chief Minister desires that the treatment of Smt P Naga Lakshmamma, W/O Sri P Buddanna, Hn.1-87, Veltoor to be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs.**3,50,000/-(Rupees Three Lakh Fifty Thousand Only**) to undergo CAD.

Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely,

(Vemula Srinivasulu)

Copy to:
SRI CMCO ,
Copy to:
Smt P Naga Lakshmamma,
W/O Sri P Buddanna,
Hn.1-87, Veltoor

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, కష్టకాలంలో అండగా నిలిచి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 3.50 లక్షల ఎల్ఓసీ మంజూరయ్యేలా కృషి చేసిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నిరుపేదల వైద్య అవసరాలను గుర్తించి ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, పేదలకు మెరుగైన వైద్యం అందేలా సహకరించడం నిజమైన సామాజిక సేవకు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక చేయూత ఎంతోమంది నిరుపేదల జీవితాల్లో ఆశలు చిగురింపజేస్తుండగా, ఆ సహాయం అర్హులకు చేరేలా కృషి చేస్తున్న బెక్కెం వేణుగోపాల్ రెడ్డి సేవలను పలువురు అభినందించారు.

స్కూల్ అసిస్టెంట్ మేరి సునీల సేవలు అభినందనీయం

- టి.పి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షుడు రాముడు నాయక్

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న మేరి సునీల పదవీ విమణ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో పాఠ శాల ఉపాధ్యాయులు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఆధ్వర్యంలో ఆత్మీయ పదవీ విరమణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా టీ.పి.ఆర్. టీ.యు అధ్యక్షుడు రాముడు నాయక్,ఇతర నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు,బంధువులు,మిత్రులుమేరి సునీల-బాబు పియర్స్ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వివిధ పాఠశాలలో ఉపాధ్యా యురాలిగా విధులు నిర్వహించి నేటి వరకు మేరిసునీల చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,సర్పంచ్,కుటుంబ సభ్యులు,స్నేహితులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు వేగం పెంచండి..

పెండింగ్ ఫైళ్లకు వెంటనే మోక్షం కల్పించండి.!

- అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా కీలక ఆదేశాలు..

భూ రీసర్వే, భూసేకరణపై ప్రత్యేక సమీక్ష

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లాలో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారుతున్న పెండింగ్ ఫైళ్లకు త్వరితగతిన పరిష్కారం చూపాలని, భూ రీసర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించడంతో పాటు భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వెబెక్స్ ద్వారా మండల తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు కీలక అంశాలపై సమీక్షించారు.

పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి ప్రాధాన్యత

రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించి, సంబంధిత నివేదికలను ఆర్డీఓలకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. డేటా కరెక్షన్, భూదాన్, భూభారతి తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లతో పాటు భౌతిక రికార్డులను కూడా పంపించాలని సూచించారు. ముఖ్యంగా బాలానగర్, నవాబుపేట, దేవరకద్ర, మిడ్జిల్, చిన్నచింతకుంట మండలాల్లో పెండింగ్ ఫైళ్లు అధికంగా ఉన్నందున వాటిని ప్రత్యేక ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.

భూ రీసర్వేలో వేగం పెంచాలి

జిల్లాలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్‌లో రీసర్వే పూర్తయినట్లు అధికారులు వివరించగా, హన్వాడ మండలంలోని తులసముద్రం, యారోనిపల్లిలో రోవర్ సాంకేతిక సమస్యల కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సాంకేతిక నిపుణులతో సమన్వయం చేసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. వచ్చే వారంలోగా ప్రతి మండలంలో రెండు సర్వే బృందాల ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కోయిలకొండ, అడ్డాకుల, మూసాపేట, మహమ్మదాబాద్, చిన్నచింతకుంట, బాలానగర్, భూత్పూర్, రాజాపూర్ మండలాల్లో రీసర్వే పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

బ్రహ్మోస్ పరిశ్రమ భూసేకరణపై ప్రత్యేక దృష్టి

భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్‌కు సంబంధించి భూత్పూర్, చిన్నచింతకుంట, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీజీఐఐసీ అధికారులతో సమన్వయం చేసుకుని అమరరాజా పారిశ్రామికవాడకు సంబంధించిన భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణపై సమీక్షిస్తూ, సర్వే పూర్తయిన భూములకు వెంటనే అవార్డులు పాస్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం

జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను సమీక్షించారు. అజిలాపూర్ ఎత్తిపోతల పథకం సర్వే పనులు దాదాపు పూర్తయిన నేపథ్యంలో వెంటనే నివేదికలు సమర్పించాలని సర్వే అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సమీక్ష

హైదరాబాద్--మహబూబ్‌నగర్--రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను కూడా కలెక్టర్ సమీక్షించారు. ఓటరు నమోదుకు అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ. యాదగిరి, భూమి రికార్డులు, సర్వే విభాగం ఏడీ అశోక్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అనుప్రియ, క్రిస్టినా, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే యముడు మీ వెంటే..!

వినూత్న ఫ్లెక్సీతో రోడ్డు భద్రతపై పెబ్బేరు ఎస్ఐ అవగాహన

పెబ్బేరు, అక్టోబర్31 ప్రజాజ్యోతి

రోడ్డు ప్రమాదాల నివారణకు, ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. "హెల్మెట్ లేకుంటే యముడు మీ వెంటే.. యముడు మిమ్మల్ని మింగేస్తాడు.." అనే హెచ్చరికతో రూపొందించిన ఫ్లెక్సీ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. రోడ్డు భద్రత మరియు హెల్మెట్ ప్రాధాన్యతపై పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ సరికొత్త పద్ధతిలో చేపట్టిన ప్రచారం ప్రశంసలు అందుకుంటోంది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాద తీవ్రతను కళ్లకు కట్టేలా ఆయన ఒక వినూత్న ఫ్లెక్సీని ఏర్పాటు చేసి వాహనదారుల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా పోలీసులు హెల్మెట్ ధరించాలని సూచనలు చేస్తుంటారు. అయితే ప్రమాద తీవ్రతను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించేలా యముడి చిత్రాన్ని, హెల్మెట్ ప్రాధాన్యతను తెలియజేసే సందేశాన్ని ఫ్లెక్సీలో పొందుపరిచారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఈ ప్రచారం ద్వారా తెలియజేస్తున్నారు. వాహనదారులు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలంటే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందేశం గుర్తుచేస్తోంది. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఇలాంటి వినూత్న అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. హెల్మెట్ ధరించండి..ప్రాణాలను కాపాడుకోండి.. మీ కుటుంబానికి అండగా నిలవండి.. అన్నదే ఈ ఫ్లెక్సీ ఇచ్చే ప్రధాన సందేశం అని ఎస్ఐ తెలిపారు.

భూముల వివరాలు భూ భారతి రికార్డుల్లో నమోదు చేయాలి

- నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో)

జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, ప్రధాన కాలువల నిర్మాణం కోసం భూసేకరణ చట్టం ద్వారా రైతులు, ప్రజల నుంచి సేకరించిన భూముల వివరాలను భూ భారతి పోర్టల్‌తో పాటు రెవెన్యూ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భూసేకరణ ద్వారా నీటిపారుదల శాఖకు బదిలీ అయిన భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, భూసేకరణ ప్రత్యేక అధికారి అరుణ రెడ్డితో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలో నూతన సాగునీటి ప్రాజెక్టులు, వాటి ప్రధాన కాలువల నిర్మాణాలకు అవసరమైన భూములను భూసేకరణ చట్టం ప్రకారం రైతులు, ప్రజల నుంచి సేకరించిన అనంతరం ఆయా భూముల వివరాలను తప్పనిసరిగా భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సంబంధిత మండలాల తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటూ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 75 గ్రామాల పరిధిలో భూముల రీ-సర్వే ప్రక్రియ

కొనసాగుతుండగా, ఇప్పటివరకు 15 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో రైతుల నుంచి సేకరించి నీటిపారుదల శాఖకు బదిలీ చేసిన భూములను రీ-సర్వేలో నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రభుత్వ భూములుగా గుర్తించి, భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక చొరవతో వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో ఇంకా కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు అమర్ సింగ్, లింగాల్, కలెక్టరేట్ విభాగపు సూపరింటెండెంట్ నారాయణ,ఏఈలు ఇల్లు డి ఇల్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ఎస్పీ కొరడా.. పోలీస్ స్టేషన్ రికార్డులపై డి.జానకి ఆరా..!

- పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ.. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి!

- రికార్డుల నిర్వహణ నుంచి కేసుల దర్యాప్తు వరకు క్షేత్రస్థాయి పరిశీలన.. అధికారులకు ఎస్పీ జానకి కీలక ఆదేశాలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

పోలీస్ స్టేషన్ల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి అధికారులకు సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆమె స్టేషన్‌లోని వివిధ విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పోలీసుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

రికార్డుల నిర్వహణపై క్షుణ్ణంగా పరిశీలన

ఈ సందర్భంగా జనరల్ డైరీ (జీడీ), క్రైమ్ రిజిస్టర్, ఎఫ్ఐఆర్ రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలు, అరెస్ట్ రిజిస్టర్లు, వారెంట్ల అమలు రికార్డులు, స్టేషన్ బెయిల్ రిజిస్టర్లు, బీట్ బుక్స్, సీసీటీఎన్ఎస్ నమోదు వివరాలు, కోర్టు కేసులకు సంబంధించిన రికార్డులను ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, ప్రతి వివరాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

కేసుల దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో విచారణ పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా పెండింగ్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, నేర నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో

పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, స్టేషన్ నిర్వహణలో సమర్థవంతమైన పనితీరు కనబరచాలని ఎస్పీ జానకి స్పష్టం చేశారు. ఈ తనిఖీలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- మార్చాల గ్రామంలో అక్రమ నిర్మాణాలపై పంచాయతీ ఉక్కుపాదం

- రోడ్డుపై నిర్మాణ సామగ్రి తొలగింపు..

మళ్లీ ఆక్రమిస్తే రూ.5 వేల జరిమానా, కేసు నమోదు చేస్తాం- పంచాయతీ కార్యదర్శి బండపల్లి రమేష్

కల్వకుర్తి, అక్టోబర్ 31(ప్రజా జ్యోతి):

గ్రామాల్లో ప్రజా రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే సహించేది లేదని మార్చాల గ్రామ పంచాయతీ కార్యదర్శి బండపల్లి రమేష్ హెచ్చరించారు. గ్రామంలోని రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో పంచాయతీ సిబ్బందితో నిర్మాణ సామగ్రిని తొలగించారు. ప్రజా రహదారులను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ రహదారులను ఆక్రమించి ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదని రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018 ప్రకారం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు, తిరిగి రోడ్డను ఆక్రమిస్తే రూ.5,000 జరిమానా విధించి, కేసు నమోదు చేసేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు.ప్రజా రహదారులు అందరికీ అందుబాటులో ఉండేలా గ్రామస్తులు సహకరించాలని, రోడ్డను ఆక్రమించి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బండపల్లి రమేష్, వార్డు సభ్యులు సికిందర్, ఆదిరాల యాదయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి.!

- పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యం..

కోర్టు డ్యూటీ అధికారులకు ఎస్పీ జానకి కీలక ఆదేశాలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

నేరం చేసిన వారికి చట్టప్రకారం శిక్ష పడేలా ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సేకరణతో పాటు కోర్టు విచారణలో సమర్థవంతమైన సమన్వయం అవసరమని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి, అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, విచారణల పురోగతి, నేర నిరూపణకు తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్ శాఖ మరియు ప్రాసిక్యూషన్ మధ్య సమన్వయం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

పటిష్టమైన ఆధారాలే నేర నిరూపణకు కీలకం

ప్రతి కేసులో నేర నిరూపణకు అవసరమైన పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించి, వాటిని కోర్టుల్లో సమర్థవంతంగా ప్రవేశపెట్టేలా కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. కోర్టు విధించిన గడువులు, ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తూ కేసుల విచారణలో జాప్యం జరగకుండా చూడాలన్నారు.

పెండింగ్ కేసులపై నిరంతర పర్యవేక్షణ

ప్రతి పెండింగ్ కేసు ప్రస్తుత స్థితి, తదుపరి విచారణ తేదీ, సాక్షుల హాజరు, సమన్లు, వారెంట్ల అమలు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కోర్టుకు హాజరుకావాల్సిన సాక్షులు, దర్యాప్తు అధికారులు సకాలంలో హాజరయ్యేలా సంబంధిత

అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

చార్జిషీట్ల దాఖలాలో జాప్యం వద్దు

దర్యాప్తు పూర్తయిన వెంటనే చట్టపరమైన నిబంధనల ప్రకారం చార్జిషీట్లు దాఖలు చేయాలని, కోర్టు విచారణకు అవసరమైన ఆధారాలు, పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ కేసుల విచారణ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను జవాబుదారీతనంతో నిర్వర్తిస్తూ కేసుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ జానకి సూచించారు.ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణ రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు పాల్గొన్నారు.

42 ఏళ్ల పోలీసు ప్రస్థానానికి ఘన వీడ్కోలు.!

- అంకితభావంతో విధులు నిర్వహించిన సయ్యద్ లైక్ అలీ సేవలు అభినందనీయం : ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

నాలుగు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో సేవలందించిన సయ్యద్ లైక్ అలీ సేవలు అభినందనీయమని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి కొనియాడారు. 42 సంవత్సరాల సుదీర్ఘ పోలీసు ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న ఆయనకు పోలీసు శాఖ తరపున ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో 42 సంవత్సరాల పాటు పనిచేయడం సాధారణ విషయం కాదని, విధి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇన్నేళ్ల సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ పొందడం ఆయన జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. పదవీ విరమణ అనంతరం విధుల ఒత్తిళ్లు, బాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకుంటూ, సంపూర్ణ ఆరోగ్యంతో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.అనంతరం సయ్యద్ లైక్ అలీని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఒ రుక్మిణి భాయ్, ఎస్పీ సీసీ రామ్ రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ప్యారసాని సురేష్, కార్యాలయ సూపరింటెండెంట్లు, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాచారంలో పోలీసుల మెరుపు తనిఖీలు.. అక్రమ బెల్ట్ షాపులపై కొరడా.!

- 200కు పైగా ఇళ్లలో కార్డన్ అండ్ సెర్చ్.. 28 వాహనాలు స్వాధీనం

- 36 బీర్ బాటిళ్ల పట్టివేత.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచారం గ్రామంలో భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని 200కు పైగా ఇళ్లలో తనిఖీలు చేపట్టిన పోలీసులు సరైన ధ్రువపత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు అక్రమ బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 36 బీర్ బాటిళ్లను పట్టుకున్నారు.

గ్రామంలో విస్తృతంగా తనిఖీలు

జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు నిర్వహించిన కమ్యూనిటీ కనెక్టింగ్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు మాచారం గ్రామంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి నివాసితుల వివరాలు, గుర్తింపు కార్డులు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో సరైన వాహన పత్రాలు చూపించని 28 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 36 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసినట్లు జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది.

గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల కార్యకలాపాలు, ఇతర అసాంఘిక చర్యలను ఉపేక్షించబోమని ఎస్పీ డి.జానకి హెచ్చరించారు.

ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కమ్యూనిటీ పోలీసింగ్ అంటే కేవలం తనిఖీలు నిర్వహించడం మాత్రమే కాదని, ప్రజలకు పోలీసులకు మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నేరాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటుబెల్ట్ ధరించాలని సూచించారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్ల మాయలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ మద్యం విక్రయాలు, మత్తు పదార్థాల కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమణరెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ నెలంతా పోలీస్ ఆంక్షలు.. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు.!

- జిల్లా వ్యాప్తంగా నవంబర్ 1 నుంచి 30 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు

- శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం.. జిల్లా ఎస్పీ డి.జానకి వెల్లడి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31(ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నవంబర్ నెల మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి వెల్లడించారు. నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఈ చట్టం అమలులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజా శాంతికి విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదు

30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న సమయంలో సంబంధిత పోలీస్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రజలకు, వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే కార్యక్రమాలకు అనుమతి ఉండదని తెలిపారు. ఏదైనా బహిరంగ కార్యక్రమం నిర్వహించాలనుకునే వారు ముందుగానే సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

పోలీస్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, చట్ట నిబంధనలను గౌరవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ జానకి కోరారు.

జీఓ కాపీ చూపించు.. రూ.25 కోట్ల డీడీ ఇస్తా..!

- ఎమ్మెల్యే సవాల్‌కు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రతి సవాల్.. జడ్చర్ల రాజకీయాల్లో అగ్గిరాజేసిన "ఆసుపత్రి" వివాదం.!- శ్వేత ఫౌండేషన్ ద్వారా ఆసుపత్రి నిర్మాణానికి రూ.25 కోట్లు డిపాజిట్ చేస్తా

-- డాక్టర్ లక్ష్మారెడ్డి స్పష్టం- మూడేళ్లుగా తొండి మాటలకే పరిమితమయ్యావా..?

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? అంటూ అనిరుధ్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు

- అంబేద్కర్ కళాభవన్ వేదికగా మాజీ మంత్రి సంచలన ప్రెస్‌మీట్..

అభివృద్ధి పనులపై పాత రికార్డులను ప్రస్తావించిన లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి బ్యూరో):

జడ్చర్ల నియోజకవర్గ రాజకీయాలు ఇప్పుడు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నాయి. ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి అన్నట్లుగా సాగుతున్న మాటల యుద్ధం తాజాగా రూ.25 కోట్ల సవాల్‌తో మరో మలుపు తిరిగింది. విమర్శలకు విమర్శలతో సమాధానమిస్తున్న రాజకీయ నేతల మధ్య ప్రజలకు కావాల్సింది మాత్రం మెరుగైన వైద్య సదుపాయాలు, అభివృద్ధి పనులు.శుక్రవారం ప్రస్తుత ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డికి రూ.25 కోట్ల డీడీ చూపిస్తే ఆసుపత్రి నిర్మాణానికి స్థలం చూపిస్తానంటూ సవాల్ విసరగా, అదే వేదికగా శనివారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అంతకంటే ఘాటుగా ప్రతి సవాల్ విసిరారు.

జీఓ కాపీ చూపించు.. డబ్బులు డిపాజిట్ చేస్తా.!

జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన స్థలం కేటాయింపు జీవో కాపీని చూపిస్తే చాలు.. శ్వేత ఫౌండేషన్ ద్వారా రూ.25 కోట్లను డిపాజిట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి తాము ఎలాంటి తప్పిదం చేయలేదని, క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.ఎమ్మెల్యే అడిగిన రూ.25 కోట్ల సవాల్‌కు సమాధానంగా ముందుగా స్థలం కేటాయింపునకు సంబంధించిన అధికారిక జీవో చూపించాలని కోరడం ఇప్పుడు జడ్చర్ల రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

వ్యక్తిగత విమర్శలా.? ప్రజా సమస్యలా.?

తనపై ఎమ్మెల్యే చేస్తున్న వ్యక్తిగత విమర్శలపై లక్ష్మారెడ్డి తీవ్రంగా స్పందించారు. రాజకీయాల్లో విధానాలు, అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించాలి తప్ప వ్యక్తిగత దూషణలకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని వారు సైతం తనను విమర్శిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. తనను కాంపౌండర్‌గా అభివర్ణించడంపై స్పందిస్తూ.. వ్యక్తిగత విమర్శలతో రాజకీయ స్థాయిని తగ్గించుకోవడం వల్ల ప్రజలకు ఒరిగేదేమిటని ప్రశ్నించారు.

జడ్చర్ల అభివృద్ధికి పునాదులు వేసింది ఎవరు.?

జడ్చర్లలో తాను ఎలాంటి అభివృద్ధి చేయలేదన్న ఎమ్మెల్యే విమర్శలను లక్ష్మారెడ్డి ఖండించారు. 2004లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో నాగర్‌కర్నూల్ నుంచి సిగ్నల్ గడ్డ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేశానని, 2014లో తిరిగి గెలిచిన తర్వాత గాంధీ చౌక్ నుంచి సిగ్నల్ గడ్డ వరకు రోడ్డు విస్తరణ చేపట్టామని

వివరించారు.అంబేద్కర్ కళాభవన్, ఎమ్మార్వో కార్యాలయం, జూనియర్ కళాశాల, బాలుర ప్రభుత్వ పాఠశాల, బాలికల ప్రభుత్వ పాఠశాల, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వంటి నిర్మాణాలు ఎవరి హయాంలో జరిగాయో ప్రజలే గుర్తించాలని పేర్కొన్నారు.అభివృద్ధి అంటే కేవలం మైకుల ముందు మాట్లాడటం కాదని, పనులు చేసి చూపించడమేనని ఆయన వ్యాఖ్యానించారు.

ఆసుపత్రిలో భవనం ఉంది.. వైద్య సిబ్బంది ఎక్కడ.?

వంద పడకల ఆసుపత్రి విషయంలో రాజకీయ నాయకులు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నప్పటికీ, అక్కడికి వచ్చే పేద రోగులకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా.? అన్నదే అసలు ప్రశ్న అని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

వంద పడకల ఆసుపత్రికి అనుగుణంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర అవసరమైన సిబ్బందిని నియమించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, సంబంధిత ప్రజాప్రతినిధులపై ఉందని అన్నారు.ఆసుపత్రి భవనం గురించి రాజకీయ చర్చలు చేయడం కంటే అక్కడ వైద్య సేవలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

నోవాటెల్ భేటీపై ప్రశ్న.. పాత రాజకీయాలను తెరపైకి తెచ్చిన మాజీ మంత్రి

2018 ఎన్నికల సమయంలో తనకు టికెట్ రాలేదన్న కారణంతో మల్లు రవిని ఓడించేందుకు తాను శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో సమావేశమయ్యానన్న ఆరోపణలపై కూడా లక్ష్మారెడ్డి స్పందించారు. ఆ సమావేశం నిజం కాదా.? అంటూ ప్రశ్నించారు. తన రాజకీయ ప్రస్థానం, గతంలో చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. మాటల యుద్ధానికి ముగింపు ఎప్పుడు.? ప్రజలకు సమాధానం చెప్పేదెప్పుడు.? ఒకవైపు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తుండగా, మరోవైపు ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులు, ఆసుపత్రి స్థలం, భూముల

వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఎమ్మెల్యే తన వాదనలో రూ.25 కోట్ల డీడీతో పాటు ఆసుపత్రికి స్థలం కేటాయింపు అంశాన్ని ప్రస్తావించిన విషయం తెలిసిందే.అయితే ఈ రాజకీయ వివాదానికి అసలు పరిష్కారం అధికారిక పత్రాలు, భూమి కేటాయింపు జీవోలు, వైద్యారోగ్య శాఖ రికార్డులు, క్షేత్రస్థాయి అభివృద్ధి పనుల వివరాల ద్వారానే లభించాల్సి ఉంది.

చివరగా జడ్చర్ల ప్రజల ప్రశ్న ఒక్కటే..

రూ.25 కోట్ల సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయ వేడి పెంచడం కంటే ఆసుపత్రికి అవసరమైన స్థలం, నిధులు, వైద్య సిబ్బంది సమకూర్చి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంపై నాయకులు దృష్టి సారించాలి. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందన్నది పత్రాలు చెబుతాయి.. ఎవరి హామీలు నెరవేరాయన్నది ప్రజలకు అందిన సేవలు చెబుతాయి. రాజకీయ నేతల మాటల యుద్ధంలో సామాన్య రోగి బలికాకూడదు. జడ్చర్లకు కావాల్సింది మరో ప్రెస్‌మీట్ కాదు.. పూర్తిస్థాయి వైద్య సేవలతో పనిచేసే వంద పడకల ఆసుపత్రి.!